కొరివి కృష్ణస్వామికి ఘన నివాళి



నివాళులర్పిస్తున్న ముదిరాజ్‌ సంఘం నాయకులు

బాలానగర్‌: స్వాతంత్య్ర సమరయోధులు, హైదరాబాద్‌ మాజీ మేయర్‌ కొరివి కృష్ణస్వామి ముదిరాజ్‌ వర్ధంతిని ముదిరాజ్‌ సంఘం ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. బాలానగర్‌లోని శోభన థియేటర్‌ సెంటర్‌లోని కృష్ణస్వామి విగ్రహానికి గురువారం పూలమాలలు వేసి నివాళులర్పించారు. ఆయన ఆశయ సాధనకు నేటి యువత కృషి చేయాలని పలువురు సూచించారు.

పాస్టర్లకు దుస్తుల అందజేత



పాస్టర్లకు దుస్తులు అందజేస్తున్న కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌గౌడ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: క్రిస్మస్‌ పండుగను పురస్కరించుకొని ఆల్విన్‌కాలనీ డివిజన్‌ పరిధిలోని పాస్టర్లకు గురువారం కార్పొరేటర్‌ దొడ్ల వెంకటేష్‌ గౌడ్‌ నూతన వస్త్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. క్రిస్మస్‌ పండుగను ఆనందంగా జరుపుకోవాలన్నారు. ఆల్విన్‌కాలనీ డివిజన్‌లోని ప్రజలందరూ కుల, మతాలకు అతీతంగా అన్ని పండుగలు కలిసి, మెలిసి చేసుకోవడం ఆనందించదగ్గ విషయమన్నారు. కార్యక్రమంలో సమ్మారెడ్డి, శివరాజ్‌గౌడ్‌, పోశెట్టి గౌడ్‌, గుడ్ల శ్రీనివాస్‌, మోజెస్‌, పాస్టర్‌లు ఇశ్రాయిల్‌, ఎం. రాజు, సురేష్‌, సత్యరాజ్‌, గోపి, శ్యాముల్‌, నాగభూషణం, సుమన్‌, జాషువా పాల్గొన్నారు.

వీఎన్‌ఆర్‌ వీజేఐఈటీలో అంతర్జాతీయ సదస్సు



సదస్సులో సావనీర్‌ను విడుదల చేస్తున్న దృశ్యం

నిజాంపేట్‌: విద్యార్థులు కంప్యూటింగ్‌, 5జీ, 6జీ సాంకేతికతను పరిశీలించి తమ నైపుణ్యాలను పెంపొందించుకోవాలని, ఇది ఆయా రంగాల్లో పురోగతికి దోహద పడుతుందని సిలికాన్‌ ల్యాబ్స్‌ సంస్థ ఇంజనీరింగ్‌ విభాగం సీనియర్‌ సంచాలకులు ఎస్‌.వెంకటేష్‌, ఐఈఈఈ రీజియన్‌ 10వ సంచాలకులు డాక్టర్‌ ఎస్‌.ఎస్‌.సమీర్‌ అన్నారు. బాచుపల్లి వీఎన్‌ఆర్‌ విజేఐఈటీ కళాశాలలో మూడు రోజుల పాటు జరిగే అంతర్జాతీయ సదస్సు గురువారం ప్రారంభమైంది. మైక్రో ఎలక్ట్రానిక్స్‌, కంప్యూటింగ్‌, కమ్యూనికేషన్‌ సిస్టమ్స్‌ రంగాల్లో చోటు చేసుకుంటున్న సాంకేతికపరమైన మార్పులపై ఈ సదస్సు జరుగుతుంది. ఈ సదస్సుకు వారు ముఖ్య అతిథులుగా హాజరై ప్రసంగించారు. సదస్సులో బంగ్లాదేశ్‌, యూఎస్‌ఏ, శ్రీలంక, దక్షిణ కొరియా, పాకిస్తాన్‌, ఖతార్‌, ఇటలీ, మన దేశానికి చెందిన పలువురు పాల్గొని 785 పరిశోధనా పత్రాలు సమర్పించగా.. 9 విభాగాల్లో 143 పత్రాలను మాత్రమే సదస్సులో నివేదించడానికి ఎంపిక చేసినట్లు వీజేఐఈటీ కళాశాల విద్యార్థి పురోగతి డీన్‌ డాక్టర్‌ పద్మశాయి తెలిపారు. డిజైన్‌ థింకింగ్‌, స్వయం పర్యవేక్షక అభ్యసనపై శిక్షణా తరగతులు నిర్వహించారు. సదస్సులో టీఐఎఫ్‌ఆర్‌ ముంబాయికి చెందిన డాక్టర్‌ సత్యనారాయణ, ఐఈఈఈ హైదరాబాద్‌ విభాగాధ్యక్షులు డాక్టర్‌ విజయలత, గ్రీన్‌ మ్యాంగో అసోసియేట్‌ డాక్టర్‌ క్లిప్‌ కుస్‌మాల్‌, విజ్ఞాన జ్యోతి కళాశాల ప్రధాన కార్యదర్శి దుర్గాప్రసాద్‌, డీన్‌ డాక్టర్‌ డీ.ఎస్‌. రావు, ప్రిన్సిపాల్‌ డాక్టర్‌ సీ.డీ . నాయుడు తదితరులు ప్రసంగించారు.

భవన నిర్మాణదారులను బెదిరించిన విలేకరులపై కేసు

కేపీహెచ్‌బీ కాలనీ : అడిగినంత డబ్బు ఇవ్వకపోతే భవనాన్ని కూల్చివేయిస్తామని బెదిరింపులకు పాల్పడుతున్న ఇద్దరు విలేకరులపై కేపీహెచ్‌బీ పోలీసులు కేసు నమోదు చేశారు. గురువారం ఎస్‌ఐ కె. లింగం తెలిపిన వివరాల ప్రకారం.. కేపీహెచ్‌బీ 7వ ఫేస్‌ లోని ఎంఐజీ 43 యజమాని ఎస్‌ కే భాషా వద్ద పవన్‌ కుమార్‌, శరత్‌ రెడ్డి మెటీరియల్‌ కాంట్రాక్ట్‌ తీసుకొని భవనం నిర్మిస్తున్నారు. అనుమతులకు మించి నిర్మాణం చేస్తున్నారని తమకు డబ్బులు ఇవ్వకపోతే పనులు జరుగకుండా చేస్తామని, భవనాన్ని కూల్చివేయిస్తామని స్థానిక విలేకరులు జంగాల నాగార్జున, బత్తిన సుమన్‌గౌడ్‌ బెదిరించారు. తమకు ఒక్కొక్కరికి లక్ష రూపాయలు ఇవ్వకపోతే కోర్టులో కేసు వేసి భవనం కూల్చివేయిస్తామని బెదిరించడంతో పవనకుమార్‌ కేపీహెచ్‌బీ పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేశారు. ఈ మేరకు పోలీసులు విలేకరులపై కేసు నమోదు చేశారు.

ఫ్లై ఓవర్‌లను నిర్మించాలి

సీఎం రేవంత్‌రెడ్డికి ఎమ్మెల్యే వినతి



సీఎం రేవంత్‌రెడ్డికి వినతిపత్రం అందజేస్తున్న ఎమ్మెల్యే కృష్ణారావు

కూకట్‌పల్లి: నియోజకవర్గంలో అవసరమైన చోట ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణాలు చేపట్టాలని ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు కోరారు. ఈ మేరకు సీఎం రేవంత్‌రెడ్డికి గురువారం వినతిపత్రం అందజేశారు. ముఖ్యంగా కేపీహెచ్‌బీ డివిజన్‌ పరిధిలోని వసంత్‌ నగర్‌ కాలనీ నుంచి గోకుల్‌ ఫ్లాట్స్‌ మీదుగా హైటెన్షన్‌ రోడ్డులో రైల్వే ఓవర్‌ బ్రిడ్జి నిర్మించాల్సిన అవసరం ఉందన్నారు. సికింద్రాబాద్‌ మొదలుకొని బోయిన్‌పల్లి, బాలానగర్‌, కుత్బుల్లాపూర్‌, శేరిలింగంపల్లి ప్రాంతాలకు చెందిన వేలాది వాహనాలు నిత్యం హైటెక్‌ సిటీకి రాకపోకలు సాగించేందుకు కూకట్‌పల్లి మీదుగా వెళ్తాయన్నారు. దీంతో ఇక్కడి కైత్లాపూర్‌ రోడ్డు, జేఎన్‌టీయూ, హైటెక్‌సిటీ రోడ్లు ప్రతి రోజు ఉదయం, సాయంత్రం వేళల్లో ట్రాఫిక్‌ సమస్య తీవ్రంగా ఉంటుందన్నారు. మియాపూర్‌, హైదర్‌నగర్‌, నిజాంపేట, ప్రగతినగర్‌, బాచుపల్లి తదితర ప్రాంతాల నుంచి హైటెక్‌ సిటీకి వెళ్లే వాహనాలు వసంత్‌ నగర్‌ కాలనీ మీదుగా హైటెన్షన్‌ లైన్‌ రోడ్డులో ప్రయాణించి నేరుగా వసంత నగర్‌ కాలనీ ద్వారా హైటెక్‌ సిటీకి చేరుకునేందుకు గోకుల్‌ ఫ్లాట్స్‌ జంక్షన్‌ వద్ద రైల్వే ఓవర్‌ బ్రిడ్జిని నిర్మించాలని కోరారు. ఈ నిర్మాణం చేపడితే జేఎన్‌టీయూహెచ్‌ రోడ్డులో నెలకొంటున్న ట్రాఫిక్‌ రద్దీని సగానికి పైగా తగ్గించవచ్చన్నారు. గతంలో జీహెచ్‌ఎంసీ ఉన్నతాధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించి రైల్వే ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం తప్పనిసరిగా చేపట్టాలని నిర్ణయించారని గుర్తు చేశారు. జీహెచ్‌ఎంసీ అధికారులకు తగిన ఆదేశాలను జారీ చేసి గోకుల్‌ జంక్షన్‌ వద్ద రైల్వే ఓవర్‌ బ్రిడ్జి నిర్మాణం చేపట్టేలా చర్యలు తీసుకోవాలని కోరారు. అదే విధంగా కూకట్‌పల్లి వై జంక్షన్‌ వద్ద ట్రాఫిక్‌ రద్దీ నియంత్రణకు ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి, అండర్‌ పాస్‌ నిర్మాణం, మూసాపేట ఆంజనేయ నగర్‌ చౌరస్తా వద్ద ఫ్లై ఓవర్‌ బ్రిడ్జి, ఫతేనగర్‌ రైల్వే అండర్‌ పాస్‌ పనులు, కూకట్‌పల్లి హుడా ట్రక్‌ పార్కు స్థలాన్ని క్రీడా ప్రాంగణానికి కేటాయించడానికి పలు వినతిపత్రాలు అందజేసినట్లు ఎమ్మెల్యే తెలిపారు.

ప్లాస్టిక్‌ నివారణకు కృషి చేయాలి



ర్యాలీలో పాల్గొన్న కార్పొరేటర్‌, అధికారులు, సిబ్బంది

మోతీనగర్‌: పర్యావరణ పరిరక్షణ కోసం ప్రతి ఒక్కరూ ప్లాస్టిక్‌ని ఉపయోగించవద్దని, జనపనారతో తయారు చేసిన సంచులను వాడాలని అల్లాపూర్‌ డివిజన్‌ కార్పొరేటర్‌ సబిహా బేగం, అసిస్టెంట్‌ మెడికల్‌ ఆఫీసర్‌ డాక్టర్‌ కార్తీక్‌రెడ్డి అన్నారు. డివిజన్‌లోని గాయత్రినగర్‌లో 'మీ ఆరోగ్యాన్ని కాపాడుకోండి' అంటూ ప్లకార్డులతో వందలాది మంది పారిశుద్ధ్య కార్మికులు గాయత్రినగర్‌ మీదుగా ఫ్రెండ్స్‌ కాలనీ, అల్లాపూర్‌, శివ బస్తీల మీదుగా ప్రధాన రోడ్లపై ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. చెత్తా చెదారాన్ని ఉదయం ఇంటి వద్దకు వచ్చే ఆటో రిక్షా కార్మికుడికి అందజేయాలన్నారు. ఇంటి పరిసర ప్రాంతాల్లో మొక్కలను నాటాలని సూచించారు. కార్యక్రమంలో శానిటరీ సూపర్‌ వైజర్‌ జమీల్‌ అహ్మద్‌, ఎస్‌ఆర్‌ పీడ్ల సురేష్‌, మూసాపేట సర్కిల్‌ జవాన్లు, ఎస్‌ఎఫ్‌ఏలు, సిబ్బంది, వివిధ కాలనీల సంక్షేమ సంఘాల అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు తదితరులు పాల్గొన్నారు.

దరఖాస్తుదారులు సర్వే సిబ్బందికి సహకరించాలి

జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ రాధిక గుప్తా



దూలపల్లిలో సర్వేను పరిశీలిస్తున్న అడిషనల్‌ కలెక్టర్‌ రాధిక గుప్తా

కుత్బుల్లాపూర్‌: ఇందిరమ్మ ఇళ్ల సర్వే ప్రక్రియ నియోజకవర్గ వ్యాప్తంగా ముమ్మరంగా కొనసాగుతోంది. గురువారం కొంపల్లి మున్సిపల్‌ పరిధి దూలపల్లి 16, 17వ వార్డుల్లో జరిగిన సర్వే ప్రక్రియను జిల్లా అడిషనల్‌ కలెక్టర్‌ రాధిక గుప్తా పరిశీలించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ.. ఇందిరమ్మ ఇళ్ల సర్వేకు వచ్చే సిబ్బందికి దరఖాస్తుదారులు సహకరించి వివరాలు అందజేయాలన్నారు. సర్వే సిబ్బంది సకాలంలో సర్వేను పూర్తి చేసేందుకు వార్డు ఆఫీసర్లు ప్రణాళికలు రూపొందించుకుని ముందుకు సాగాలన్నారు. ఈ సర్వేలో మున్సిపల్‌ కమిషనర్‌ శ్రీహరి, మేనేజర్‌ వెంకటేశం, సీనియర్‌ అసిస్టెంట్‌ రాజు, వార్డు ఆఫీసర్‌ శ్రీకాంత్‌ తదితరులు పాల్గొన్నారు.

27న భవిష్యనిధి అదాలత్‌

మూసాపేట: కూకట్‌పల్లిలోని పీఎఫ్‌ కార్యాలయం ఆధ్వర్యంలో ఈ నెల 27న భవిష్యనిధి అదాలత్‌ నిర్వహించనున్నట్లు పీఎఫ్‌ కమిషనర్‌ డాక్టర్‌ హేమంత్‌ గురువారం తెలిపారు. ప్రశాంత్‌ నగర్‌లోని ఆర్టీసీ బస్‌ టెర్మినల్‌లోని రెండవ అంతస్తులో ఉన్న పీఎఫ్‌ కార్యాలయంలో, సర్దార్‌ పటేల్‌నగర్‌లో, స్ప్రెస్‌ ఫెసిలిటీస్‌ ప్రైవేట్‌ లిమిటెడ్‌ మంజు రెసిడెన్సీలో ఉదయం 10 నుంచి సాయంత్రం 4 గంటల వరకు అధికారులు అందుబాటులో ఉంటారని పేర్కొన్నారు. ఖాతాదారులు తమ సమస్యలు పరిష్కరించుకోవాలన్నారు. సలహాలు, సూచనలు కూడా స్వీకరిస్తామని తెలిపారు. కూకట్‌పల్లి, జీడిమెట్ల, సనత్‌నగర్‌, బీహెచ్‌ఈఎల్‌ తదితర ఖాతాదారులు పాల్గొనాలన్నారు.

ముందస్తు అరెస్టు

మూసాపేట: ఎస్సీ వర్గీకరణకు వ్యతిరేకంగా మాల మహానాడు రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు అసెంబ్లీ ముట్టడి కార్యక్రమానికి వెళ్లకుండా కూకట్‌పల్లి పోలీసులు చర్యలు తీసుకున్నారు. గురువారం గ్రేటర్‌ హైదరాబాద్‌ కో చైర్మన్‌ నపారి చంద్రశేఖర్‌ను ఉదయం 6 గంటలకు అరెస్టు చేసి ఎస్‌ఐ ఇంద్రసేనారెడ్డి స్టేషన్‌కు తరలించారు.

'మనూ' అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ సబాఖాతూన్‌కు పీహెచ్‌డీ

రాయదుర్గం: మౌలానా ఆజాద్‌ జాతీయ ఉర్దూ విశ్వవిద్యాలయంలో అసిస్టెంట్‌ ప్రొఫెసర్‌ సబాఖాతూన్‌కు గురువారం పీహెచ్‌డీ డిగ్రీని ప్రకటించారు. ఆంగ్ల విభాగంలో ప్రొఫెసర్‌ కొత్తచెరువు నాగేంద్ర పర్యవేక్షణలో 'ఇంటిగ్రేషన్‌ ఆఫ్‌ ఐసీటీ ఇన్‌ ఇంగ్లిష్‌ టీచింగ్‌ ప్రాక్టీస్‌ :యాన్‌ అసెస్‌మెంట్‌ ఆఫ్‌ ఉస్మానియా యూనివర్సిటీ బీఈడీ ప్రోగ్రామ్‌' అనే అంశంపై థీసిస్‌ను సమర్పించారు. ఆమెను పలువురు ప్రొఫెసర్లు, ఫ్యాకల్టీ అభినందించారు.

పీఆర్‌టీయూతోనే ఉపాధ్యాయులకు న్యాయం

నిజాంపేట్‌: పీఆర్‌టీయూటీఎస్‌ బాచుపల్లి మండల శాఖ ఆధ్వర్యంలో గురువారం మండల శాఖ అధ్యక్షుడు పర్మగళ్ల నరసింహులు అధ్యక్షతన సమావేశం జరిగింది. ముఖ్య అతిథిగా రాష్ట్ర అధ్యక్షుడు శ్రీపాల్‌రెడ్డి హాజరై మాట్లాడారు. పీఆర్‌టీయూ సంఘం బలంగా ఉంటేనే ప్రభుత్వ పాఠశాలల్లో విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉంటుందన్నారు. ఉపాధ్యాయుల హక్కుల సాధనకు సంఘం నిరంతరం పోరాటం చేస్తుందన్నారు. కార్యక్రమంలో మేడ్చల్‌ జిల్లా అధ్యక్షుడు రామేశ్వర్‌గౌడ్‌, ప్రధాన కార్యదర్శి ఆనంద్‌రెడ్డి, బాచుపల్లి మండల కార్యదర్శి ప్రమోద్‌కుమార్‌రెడ్డి, రాష్ట్ర బాధ్యులు శేఖర్‌, జిల్లా బాధ్యులు చెన్నయ్య, ప్రదీప్‌సింగ్‌, మండల బాధ్యులు సుమలత, వెంకటేశ్వరరావు, శివప్రసాద్‌, ఉపాధ్యాయులు రఘునాథ్‌ తదితరులు పాల్గొన్నారు.

జోనల్‌ కమిషనర్‌కు ఆహ్వానం



జోనల్‌ కమిషనర్‌కు ఆహ్వానం అందజేస్తున్న కుమార్‌ యాదవ్‌ తదితరులు

ఆల్విన్‌కాలనీ: నెహ్రూ యువ కేంద్రం రంగారెడ్డి శాఖ ఆధ్వర్యంలో ఆల్విన్‌కాలనీ, బీకే మైదానంలో 21వ తేదీన నిర్వహించే క్రీడా పోటీలకు ముఖ్య అతిథిగా హాజరు కావాలని అధికారిక లేఖను ఎన్‌వైకే సభ్యుడు కుమార్‌యాదవ్‌ జోనల్‌ కమిషనర్‌ అపూర్వ చౌహాన్‌కు గురువారం అందజేశారు. ఈ సందర్భంగా కుమార్‌ యాదవ్‌ మాట్లాడుతూ.. క్రీడలపై ఆసక్తి ఉన్న యువత క్రీడా పోటీల్లో పాల్గొనాలన్నారు. కబడ్డీ పోటీలను నిర్వహిస్తున్నామని తెలిపారు. ఆసక్తి ఉన్న వారు 8008000724 నెంబర్‌ను సంప్రదించాలని సూచించారు. కార్యక్రమంలో యూత్‌ ఫోర్స్‌ అధ్యక్షులు బింగి రాములు, సంపత్‌ పాల్గొన్నారు.

కేంద్ర హోంమంత్రి దిష్టిబొమ్మ దహనం



నిరసన తెలుపుతున్న నాయకులు

కూకట్‌పల్లి: బాలానగర్‌లో టీపీవైఎఫ్‌ రాష్ట్ర అధ్యక్షుడు నగేష్‌సతీష్‌కుమార్‌, కార్యదర్శి మట్టే ప్రసన్న కుమార్‌ ఆధ్వర్యంలో కేంద్ర హోంమంత్రి అమిత్‌ షా దిష్టిబొమ్మను గురువారం దహనం చేసి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. భారత రాజ్యాంగ నిర్మాత డాక్టర్‌ బాబా సాహెబ్‌ అంబేడ్కర్‌పై కేంద్ర హోంమంత్రి చేసిన వ్యాఖ్యలను తీవ్రంగా ఖండిస్తున్నామన్నారు. అంబేడ్కర్‌ను తక్కువ చేయడం సరికాదన్నారు. దేశ ప్రజలకు వెంటనే బహిరంగ క్షమాపణ చెప్పాలని, తన పదవికి రాజీనామా చేయాలని డిమాండ్‌ చేశారు. కార్యక్రమంలో నర్సింగ్‌రావు, సంతోష్‌, ఎర్ర అఖిల్‌, మల్లేష్‌, రంజిత్‌, సుదర్శన్‌, చిలుక వరుణ్‌కుమార్‌ తదితరులు పాల్గొన్నారు.

ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం సర్వే



సర్వే చేస్తున్న అధికారులు, పాల్గొన్న నాయకులు

ఓల్డ్‌ బోయిన్‌పల్లి: ప్రజా పాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్ల లబ్ధిదారుల ఎంపిక కోసం అధికారులు కసరత్తు మొదలు పెట్టారు. దీనిలో భాగంగా గురువారం ఓల్డ్‌ బోయిన్‌పల్లి డివిజన్‌లోని యాదవబస్తీ, కుమ్మరిబస్తీ, ఓల్డ్‌ బోయిన్‌పల్లి, హస్మత్‌పేట ప్రాంతాల్లో యూసీడీ సీఓ మహిపాల్‌రెడ్డి ఆధ్వర్యంలో సిబ్బంది ఇంటింటికీ తిరిగి దరఖాస్తుదారులు అర్హులేనా? కాదా? అని సర్వే నిర్వహిస్తున్నారు. సర్వే నిర్వహిస్తున్న విషయం తెలుసుకున్న టీపీసీసీ కార్యదర్శి దండుగుల యాదగిరి నాయకులు మల్లికార్జున యాదవ్‌, అశోక్‌, శ్రీరాములు సర్వేను పరిశీలించారు. కార్యక్రమంలో అష్మద్‌, అస్లాం, విజయలక్ష్మి, శ్రావణి తదితరులు పాల్గొన్నారు.

చెత్తను తొలగించారు





చెత్తను తొలగించి, బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లుతున్న మున్సిపల్‌ సిబ్బంది

మూసాపేట: బాలాజీనగర్‌ డివిజన్‌ ఆంజనేయ నగర్‌ కాలనీలో పాపవినాశనం ఆలయానికి వెళ్లే దారిలో పేరుకుపోయిన చెత్తా చెదారాన్ని గురువారం మున్సిపల్‌ సిబ్బంది తొలగించారు. 'సాక్షి' దిన పత్రికలో గురువారం 'చెత్తను తొలగించరా?' అనే శీర్షికతో వచ్చిన కథనానికి అధికారులు స్పందించారు. పొంగి పొర్లుతున్న డ్రైనేజీకి మరమ్మతులు చేసి ఆలయానికి వెళ్లే దారిలో బ్లీచింగ్‌ పౌడర్‌ చల్లారు. దీంతో స్థానికులు హర్షం వ్యక్తం చేశారు.

అధికారుల తీరుతో ప్రజలకు ఇబ్బందులు

ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు



దుండిగల్‌: అధికారుల నిర్లక్ష్యం వల్ల రోడ్డు పనులు నత్తనడకన సాగుతున్నాయని, దీంతో ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఎమ్మెల్సీ శంభీపూర్‌ రాజు అన్నారు. శాసనమండలిలో ఆయన మాట్లాడుతూ.. బాచుపల్లి నుంచి మల్లంపేట మీదుగా బౌరంపేట వరకు గత బీఆర్‌ఎస్‌ ప్రభుత్వం రూ.140 కోట్లతో పనులు ప్రారంభించిదన్నారు. మల్లంపేటలోని గుడి వద్ద వాటర్‌ లైన్‌ కారణంగా పనులు చేయడం లేదని, వాటిని తొలగించడానికి జలమండలి అధికారులు రూ.60 లక్షలు ఖర్చు అవుతుందని చెప్తున్నారని తెలిపారు. విద్యుత్‌ అధికారులు సైతం విద్యుత్‌ స్తంభాలను మార్చడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. శంభీపూర్‌–మల్లంపేట వద్ద ఎగ్జిట్‌ ఏర్పాటు చేయడం వల్ల ట్రాఫిక్‌ తీవ్రంగా నెలకొంటుందన్నారు. వివిధ శాఖల అధికారుల సమన్వయలోపం వల్ల సమస్య జఠిలమవుతుందని సభ దృష్టికి తీసుకువచ్చారు. దీనిపై స్పందించిన మంత్రి కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి మాట్లాడుతూ.. అధికారులతో చర్చించి రూ.60 లక్షలు మంజూరు చేస్తామని హామీ ఇవ్వడంతో శంభీపూర్‌ రాజు ప్రజల పక్షాన కృతజ్ఞతలు తెలిపారు.

ఫిల్మ్‌, ఎంటర్‌టైన్‌మెంట్‌ పరిశ్రమలో

విజయం సాధించాలంటే నైపుణ్యం అవసరం

టీహబ్‌ సీఈఓ సుజిత్‌ జాగిర్దార్‌

రాయదుర్గం: ఫిల్మ్‌, ఎంటర్‌టైన్‌మెంట్‌ పరిశ్రమలో విజయం సాధించాలంటే నైపుణ్యం ఎంతో ముఖ్యమని టీహబ్‌ సీఈఓ సుజిత్‌ జాగిర్దార్‌ పేర్కొన్నారు. గురువారం హైదరాబాద్‌ నాలెడ్జి సిటీలోని టీ హబ్‌లో ఫిల్మ్‌ ఎడ్యుకేషన్‌లో అగ్రగామి 'మీ స్కూల్‌' ద్వారా సినీప్రెన్యూర్‌ ప్రోగ్రామ్‌ కోహర్ట్‌–5ను ప్రారంభించారు. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లను అందించారు. అనంతరం జరిగిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ మీ స్కూల్‌ సృజనాత్మకతను పెంపొందించడంలో ముందంజలో ఉందన్నారు. సినీప్రెన్యూర్‌ ప్రోగ్రామ్‌ వారి అంకితభావానికి నిదర్శనమన్నారు. 'మీ స్కూల్‌' వ్యవస్థాపకులు ప్రతిభ పులిజాల మాట్లాడుతూ క్రియాశీల ప్రతిభను పెంపొందించడంలో, ఆశాజనకమైన చిత్ర నిర్మాతలు, సృజనాత్మక వ్యాపారవేత్తలు వారి కలలను నెరవేర్చడంలో ముందుకు సాగుతున్నామన్నారు డీఓపీ డైరీస్‌ అనే పాడ్‌కాస్ట్‌ సిరీస్‌ను ప్రవేశపెట్టడం గర్వంగా ఉందన్నారు.కాగా తెలంగాణ రాష్ట్ర తొలి మహిళా సినిమాటోగ్రాఫర్‌ విజయక్ష డీఓపీ డైరీస్‌ ప్రారంభ ఎపిసోడ్‌ను హోస్ట్‌ చేయడం విశేషం. ప్రముఖ సినిమాటోగ్రాఫర్‌, దర్శకుడు పిజివిందా, మాజీ నిర్మాత పరుశురామ్‌, టీహబ్‌ ఉపాధ్యక్షుడు శ్రీనివాస్‌, విద్యార్థులు, టీహబ్‌, మీస్కూల్‌ ప్రతినిధులు పాల్గొన్నారు.



టీహబ్‌లో మీ స్కూల్‌ గ్రాడ్యుయేషన్‌ సర్టిఫికెట్లను అందజేస్తున్న సుజిత్‌ జాగిర్దార్‌, స్కూల్‌ ప్రతినిధులు

నయనానందకరం..

మాదాపూర్‌: శిల్పారామంలో నిర్వహిస్తున్న అంతర్జాతీయ హస్తకళా మేళాలో భాగంగా గురువారం ఫిలడెల్ఫియా, యునైటెడ్‌ స్టేట్స్‌ ఆఫ్‌ అమెరికా నుంచి వచ్చిన కూచిపూడి నర్తకి స్నేహ ఇంద్రగంటి తన నృత్యప్రదర్శనతో సందర్శకులను ఆకట్టుకున్నారు. రాధికాకృష్ణ, అష్టపది, నీలమేఘ శరీర తరంగం అంశాలను ప్రదర్శించారు. అలాగే కేరళకు చెందిన హేతి గ్రూప్‌ కళాకారులు శివగంగ, మనీషా, గోపిక, శ్రీలక్ష్మి, మేఘ తదితరులు అష్ట అయ్యప్ప అవతారం, శ్రీ శబరి గిరినాదం, ఆనందభైరవి, మధువాడి ,తిల్లాన అంశాలను ప్రదర్శించారు.





కొమ్మలను తొలగించారు.. అక్కడే వదిలేశారు





ఎండిపోయిన చెట్ల కొమ్మలు, చెత్తా చెదారం

- విద్యుత్‌ వైర్లకు అడ్డుగా ఉన్న చెట్ల కొమ్మలు తొలగింపు
- నెలల గడుస్తున్నా తొలగించని వైనం

మోతీనగర్‌: ప్రధాన వీధుల్లో సరఫరా అయ్యే విద్యుత్‌ హైటెన్షన్‌ వైర్లకు అడ్డుగా వస్తున్న చెట్ల కొమ్మలను తొలగించి అక్కడే వదిలేశారు. నెలల తరబడి అక్కడే ఉండటంతో ఆ కొమ్మల ఆకులు రోడ్డంతా విస్తరించాయి. మూసాపేట డివిజన్‌ బాలాజీ స్వర్ణపురి కాలనీలో కొన్ని నెలల నుంచి తొలగించిన చెట్ల కొమ్మలను అక్కడే పడేయడంతో కొమ్మలు ఎండిపోయి వాటి ఆకులు గాలి వీచినప్పుడు సమీప నివాసాల్లోకి వస్తున్నాయి. కొమ్మలు వేసిన ప్రాంతంలో పరిసర ప్రాంతవాసులు పాత దుస్తులు, పాడైన సోఫా సెట్స్‌, ఇతర సామానులను సైతం అక్కడే వేస్తున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు వెంటనే స్పందించి డివిజన్‌లోని బాలాజీ స్వర్ణపురి కాలనీలో, మోతీనగర్‌, పాండురంగనగర్‌తో పాటు వివిధ బస్తీ, కాలనీల్లో ఉన్నటువంటి చెట్ల కొమ్మలను తరలించాలని ఆయా కాలనీ వాసులు డిమాండ్‌ చేస్తున్నారు.



బాలాజీ స్వర్ణపురి కాలనీ పార్కు ప్రహరీ వద్ద ప్రమాదకరంగా ఉన్న మట్టి దిబ్బ